


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఉమ్మడి కుటుంబాలు

**చిన్నప్పుడు** మనం ఎవరింటికైనా వెళ్ళాం అనుకోండీ.. కూర్చోడానికి చోటు దొరకడం కష్టంగా వుండేది. హాల్లో ఒకటో రెండో చెక్క కుర్చీలు వుంటే వాటి మీద బట్టలు ఆరేసి వుండేవి. ఒక కుక్కి మంచం వుంటే బామ్మగారో, తాతగారో వాటిమీద పెట్టిన పేపర్లూ, బట్టలూ మధ్యనుండి మినుకు మినుకు మంటూ చూస్తూ, కంటికి చెయ్యి అడ్డం పెట్టుకుని స్కాన్ చేసి "ఎవర్రా?" అని ప్రశ్నలు వేసేవాళ్ళు.

నలుగురు పిల్లలు బట్టలు లేకుండా ఒకడి భుజాలు ఒకడు పట్టుకుని, మనని తోసుకుంటూ పరిగెడ్తూ, అడ్డంగా వున్నామని రయ్యిన విజిల్ వేసి, పక్కకి తోసి పరిగెడ్తూ వుంటే, ఒక పిల్ల గార్డులా వాళ్ళమ్మ పచ్చ జాకెట్టు ఊపుతుండేది.

ఒకాయన పూజగదిలో దేవుడి ముందు కళ్ళు మూసుకుని యోగ నిద్రో లేక స్థలం లేక నిజం నిద్రలోనో జోగుతూ మనం పిలిచినా పట్టించుకునే వాడు కాడు.

ఒక కోడలు చంటాడు పోసిన 'పాస్' తుడవడానికి అలుకు గుడ్డతో వచ్చి, మనని చూసి "కూర్చోండి కూర్చోండి" అని ఆ అలుకు గుడ్డతోనే కుర్చీ తుడిచి "అత్తయ్యగారు వంట చేస్తున్నారు, మీరొచ్చారని చెప్తాను" అని తను కోడలిగా ఇంట్రడ్యూస్ చేసుకుని, వచ్చినంత స్పీడ్‌గానూ బుజ్జిగాడి ఏడుపు విని లోపలకి వెళ్ళేది.

ఒకతను పేపర్ చదువుతూ బయటకి వచ్చి,ఉన్న ఒక్క కుర్చీలో మనం కూర్చోడంతో ఎగాదిగా చూసి, మాటైనా మాట్లాడకుండా లోపలికి పోయేవాడు. ఇంకో కోడలు కాస్త పద్ధతిగా మంచి, నీళ్ళ గ్లాసులతో వచ్చి "కాఫీ తీసుకుంటారా? అని అడగగానే మనం "మీ అత్తయ్యగారిని పిలవండి చాలు" అనేవాళ్ళం.

"పండగొస్తోంది కదా.. అరిశల పాకం తీస్తున్నారు.. వచ్చేస్తున్నారు" అని మర్యాదకల కోడలు "ఎక్కడినుండొచ్చారూ?" అని ఆరాలు తీసేది.

"పక్క వీధిలోని విశాలాక్షి గారి మూడో కోడల్ని అండీ.. మా ఆడపడుచు శీమంతం" అని చెప్పగానే,

"మొదటిసారా? ఏ ఊరిచ్చారూ?" అని బోలెడు ప్రశ్నలు వేసేది.

బామ్మగారు "ఖళ్ళ్ ఖళ్ళ్ మని దగ్గేది "నేనున్నాను" అంటూ. ఆ అతర్వాత నెమ్మదిగా లేచి కూర్చుని "నారాయణా.. గోవిందా... వాసుదేవా" అని పిలిచేది. ఎవరూ వచ్చేవారు కారు..

"నన్నెప్పుడు తీసుకెళ్తావు?" అనేది.

"ఆవిడ ఎవర్నో పిలుస్తోంది" అని మనం సీరీయస్‌గా అంటే, చిన్న కోడలు నవ్వి, "భగవంతుడ్ని అండీ" అని ఖాళీ చేసిన మంచి నీళ్ళ గ్లాస్‌తో లోపలికి వెళ్ళేది.

"మీరు నా మాత్స్ నోట్ బుక్ మీద కూర్చున్నారు.. లేవండి" అని ఒక ఎనిమిదేళ్ళ రెండు జెళ్ళ పిల్ల వచ్చి, మనని గద్దె మీద నుండి బలాత్కారంగా దింపేస్తే, లేచి తెల్ల మొహం వేసుకుని నిలబడేవాళ్ళం.

"ఆది లక్ష్మి కూతురివా?" బామ్మగారు ప్రశ్నలు మొదలెట్టేవారు.

"కాదండీ.. విశాలాక్ష్మిగారి కోడల్ని."

"ఓ.. ఆదిలక్ష్మి కోడలివా? మీ అమ్మ బాగుందా?"

"బాగుందండీ. కానీ మా అమ్మ మరకత వల్ల అండీ."

"అరిశవిల్లి వెళ్ళిందా? ఆదిలక్ష్మి నామీద ఎంతో ప్రేమగా వుండేది"

ఈ విధంగా మాటకి మాటా అతక కుండా కొంచెం సేపు సంభాషణ నడిచేది.

ఓ అబ్బాయి కళ్ళ జోడెట్టుకుని, షర్ట్ లేకుండా వచ్చి, వంకీకున్న బట్టలు అన్నీ తడిమి "ఇందాక ఇక్కడ బనీన్ విడిచి పెట్టి వెళ్ళాను, ఎవరేసుకున్నరూ? ఇదిగో.. నిన్నే.." అని కేకలు పెట్టేవాడు. ఇందకా పిల్లాడి పాస్ తుడిచిన చిన్న కోడలొచ్చి "మీ అన్నయ్య గారబ్బాయి వేసుకుని వెళ్ళాడండీ" అనేది.

"ఆ బడుద్దాయి నా బనీన్ వేసుకు వెళితే, నేను ఆఫీస్‌కి ఏం వేసుకు వెళ్ళాలి." అని అరిచి, మనని చూసి "ఎవరో వచ్చారని అమ్మకి చెప్పావా?" అని గొంతు తగ్గించి అడిగి లోపలికి పోయేవాడు.

ఇందాకా రైలు ఆట ఆడిన వాళ్ళలో ఒకడు ముక్కు పగిలి ఏడుస్తూ, రైలు కూతకన్నా భయంకరంగా గుక్క పెట్టి లోపలికి వచ్చేవాడు. పెద్ద కోడలు పరిగెత్తుకొచ్చి "ఎవ్రా ఇలా కొట్టిన వెధవలూ.. పందార పెడ్తాను పెదవికి..రా" అని తీసుకెళ్తుంటే, వాడు గింజుకుని, "శీనుగాడ్ని కొట్టు....కొట్టు.." అని హిస్టీరిక్‌గా అరిచేవాడు.

"రైలూ రైలూ ఢీ కొట్టుకుని వాడు వెళ్ళి రాళ్ళ గుట్ట మీద పడితే నేనేం చెయ్యాలి?" అని శీనుగాడు వచ్చి వకాల్తా చేసేవాడు.

ఏడుస్తున్న వీడూ వాడి మీద కలబడడంతో, పెద్ద రణరంగమే జరిగేది.

"మాయదారి పిల్లలు.. మా రోజుల్లో ఇలా వుండేవారు కారు. పధ్నాలుగు మంది సంతానం నాకు" అని మంచంలో ముసలావిడ చెప్పేది.

మనం ఆవిడతోబాటు టైం మిషన్ ఎక్కి పాత రోజుల్లోకి వెళ్తూ వుండగా, ఇంటి ముందు రిక్షా ఆగేది. ఉన్నవాళ్ళు చాలనట్లు తట్టా బుట్టా, ఇద్దరు పసిపిల్లలతో ఒకావిడ దిగి "అన్నాయ్! రెండు రూపాయల చిల్లరుందా?" అని కేకలు పెట్టేది.

"ఇచ్చెయ్ తల్లీ, అంతా చడావ్ వుంది, లాగలేక చచ్చా" అనేవాడు ఆ రిక్షా అతను, ఈ అమ్మాయి ఊబకాయాన్ని చూస్తూ.

"ఒక్క సవారీకి అంతా?" అని ఆవిడ గద్దించేది.

కూడా వచ్చిన పిల్లలు "ఆకలి.. ఆకలి.. అని చిందులు తొక్కేస్తూ వుంటే, లోపలి నుండి బనీన్ లేని చిన్నన్నయ్య వచ్చి ఆ రిక్షా అతనికి రెండు రూపాయలిచ్చి "బావ రాలేదా?" అనేవాడు.

"అంత ముచ్చట కూడానా?" అని అమ్మాయి మూతి తిప్పి "వీళ్ళెవరు" అని మమ్మల్ని చూసేది.

"రారా చిట్టి తల్లీ.. ఎంత సేపైంది వచ్చి?" అంటూ పెద్ద కోడలు వచ్చేది.

ఈ వచ్చిన ఇద్దరు పిల్లలూ, ఆల్‌రెడీ వున్న నలుగురు పిల్లలూ, అతి శ్రీఘ్రంగా ఒకరిని ఒకరు కింద పడేసి మల్ల యుద్ధం మొదలెట్టేవారు.

"బామ్మా బావున్నావా?" వచ్చినావిడ ముసలావిడ్ని పలకరించేది.

"వీళ్ళా? ఆదిలక్ష్మి కూతురూ వాళ్ళూట" అని మమ్మలి తనకి తోచిన మిస్టెకెన్ ఐడెంటిటీతో ఆవిడ పరిచయం చేసేది.

ఇల్లు హౌస్‌ఫుల్ అయి, ఉన్న ఒక్క కుర్చీ పోయి, మేం లేచి "వెళ్ళొస్తాం.. అత్తయ్యగారికి చెప్పండి. బొట్టు పెట్టించుకోండి.. సాయంత్రం శీమంతం పేరంటానికి రండి" అనగానే,

"ఉండండి.. ఉండండి.. అత్తయ్యగారు మీరు వెళ్ళిపోతే నొచ్చుకుంటారని" పెద్ద కోడలు ఆపేసేది.

ఆవిడకి అరిశల పాకం కుదిరి లోపలనుండి ఎప్పటికొస్తుందో అని నీరసంగా ఆశగా ఆవిడ కోసం ఎదురు చూస్తూ వుండగా, యోగనిద్రలోని ముసలాయన లేచి వచ్చేవాడు.

"రష్యాలో ఏం జరుగుతోందో తెలుసా?" అనేవాడు.

ఆ జి.కె క్వెశ్చన్‌కి మేం వెర్రి మొహాలు వెయ్యగానే "మీ అమ్మలాంటి వాళ్ళని రష్యా పంపించాలి.. మోండా మార్కెట్ నుండి తెచ్చిన కూరలలో సగం కుళ్ళబెట్టేస్తుంది. అసలు రేషన్ కార్డ్ మీద కూరలు పొదుపుగా ఇవ్వాలి" అని ఆర్ధిక విధానాలు చెప్పడం మొదలెట్టి, ట్రాన్‌సిస్టర్ ఆన్ చేసేవాడు. అది బోలెడు పిల్లికూతలూ, కుక్క కూతలూతో రకరకాల శబ్దాలు చేసి ఆన్ అయ్యేది" వార్తలు చదువుతున్నది... అద్దంకి మన్నార్" అన్న తర్వాత మాటలు మాయం అయి మళ్ళీ పిల్లి కూతలు, ఆయన దాని పిర్రమీద రెండు దెబ్బ లేసాక, మళ్ళీ ప్రధాని పేర్కొన్నారు. సభలో అందరూ ఆమోదం తెలిపారు. వేసవి కాలం

సమావేశాలలో మళ్ళీ పిల్ల కూతలు ఈసారి ట్రాన్సిస్టర్ నెత్తి మీద రెండు తగిలించాక, "ఈ విధంగా సమావేశాలలో తీర్మానాలయ్యాయి" అని వచ్చేది.

"ఏం తీర్మానించారూ? దిక్కుమాలిన ట్రాన్సిస్టర్" అని ముసలాయన అరిచేవాడు.

ఇలా ఓ డజన్ మంది ఇంటికి వచ్చినవాళ్ళ ముందు ప్రదర్శనలు ఇచ్చాకా, "అయ్యో.. ఇంతసేపు కూర్చోపెట్టేసాను.. ఏమీ అనుకోకండీ.. పండగ కదా! ఒక్కొక్క అమ్మాయే వస్తోంది పుట్టింటికి" అంటూ కొంగుతో చేతులు తుడుచుకుంటూ, ఆ అత్తగారు బయటకి వచ్చేవారు.

ఇల్లు కర్ణభేరి బద్దలయ్యే అరుపులతో, పిలుపులతో, ఏడుపులతో మారుమోగుతుంటే, అందరికీ బొట్లు పెట్టి, పిలిచి బయట పడేవాళ్ళం, దాదాపుగా ఇవే పరిస్థితుల్లో ఇంకో పది, పన్నెండిళ్ళల్లో పిలుపులు అయి ఇంటికి నీరసంతో పాకుతున్నట్లు వచ్చేసరికి సదరు శీమంతం పిల్లకి పురుడొచ్చేస్తుందేమో అనిపించేది. అంతంతసేపు పట్టేది ఒక్కో ఇంట్లో, కేరెక్టర్ ఇంట్రడక్షన్‌కే గంటపైన పట్టేది.

మరి ఈ రోజుల్లో.. ఫ్లాట్ తలుపు వేసి వుంటాయి. మనం బెల్ కొట్టాక పనిమనిషి వచ్చి తలుపు తీస్తుంది.

"పేరంటం పిలవడానికొచ్చాం" అంటే,

"మేడంకి ఫోన్ చేసి వచ్చారా? వర్క్‌ఔట్స్ చేస్తున్నారు" అంటుంది.

"చేసొచ్చాం" అంటే, తటపటాయించి "చెప్తా" అని మన మొహం మీదే తలుపేసి లోపలికి వెళ్తుంది.

ఓ పది నిమిషాల తర్వాత తలు తీసి "రండి.. అని సోఫా చూపిస్తుంది."

ఇల్లంతా నిశబ్దంగా వుంటుంది. ఇంటి యజమాని వచ్చి "హలో" అని బయటకి వెళ్ళిపోతాడు.

చాలా సేపటికి ఇల్లాలు టవల్ తలకి చుట్టుకుని వచ్చి "ఓ సారీ! మీరొస్తున్నారు అని త్వరగా షవర్ చేసొచ్చా.. డూ యూ లైక్ టు హేవ్ ఎనీ థింగ్ లైక్ కాఫీ?" అంటే మనం "ఒద్దండీ ఈవెనింగ్ పేరంటానికి రండి" అని బొట్టు పెట్టబోతే, "నో... సారీ నాకు ఎలర్జీస్ వున్నాయి.. బొట్టు గడపకి పెట్టండి" అని వెనక్కి జరిగి "ఈవెనింగ్ ఐ యాం క్వైట్ బిజీ.. సారీ" అంటుంది.

మనం ఇంకా సోఫాలోంచి లేవకముందే సెల్‌ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని

హలో! ఐ యాం ఏ కైండ్ ఆఫ్ బిజీ ఫ్రమ్ మార్నింగ్.." అని లోపలికి వెళ్ళిపోతుంది.

పనిమనిషి తలుపు వెయ్యడానికి రెడీగా నిలబడి వుంటుంది.

అప్పటికీ ఇప్పటికీ చాలా వ్యత్యాసం. అప్పటి రోజుల్లో ఆ జనం.. హడావిడీ.. పండగొస్తోందంటే చుట్టాలూ – సరదా, పిండి వంటలూ.. పేరంటాలూ వుండేవి.

ఇప్పుడు పండగైనా మాములు రోజులైనా స్విగ్గీలూ, నెట్‌ఫిక్స్‌లూ... రీల్స్, ఇన్‌స్టాలూ.. ఇదో హడావిడి. విజయదశమి శుభాకాంక్షలు.

Post your comments







